# చెదలు

ఎడ్ల బండి పట్టణం నుండి పల్లెకొస్తుంది. ఓ యూరియా బస్తా, నిండు కిరోసిన్ డబ్బా, దానికి గడ్డిని మలిచి పెట్టిన బిరడా. కట్ట కట్టిన కొన్ని ఖాళీ బస్తాలు బండిలోని సామాన్లు.

నిమస్తిని, తలపాగ, పెరిగిన గడ్డం, అర్వై ఏళ్ళ వయస్సు, కమిష కర్రను కదవ కింద పెట్టుకొని తపస్సు చేస్తున్న ఋషిలా కూర్చున్నాడు బండి తోలే వ్యక్తి. ఖాళీ బండి కావడం వల్ల ఒకే మేరలో లాక్కొస్తున్న ఎడ్లు, తార్రోడ్డును వదిలి, వాటంతటవే పల్లెకెళ్ళే బండ్లబాటన నడుస్తున్నాయి. అది చూసి అక్కడే నిలుచున్న ఓ యువకుడు "ఈ బండి మర్రి గూడెమే వెడుతుందా" అంటూ అడిగాడు.

'అవునన్నట్లు' తల వూపాడు బండిలోని వ్యక్తి.

"నేనూ ఆ ఊరేవెళ్ళాలి" అంటూ బండి ఎక్కమంటావా అన్నట్లు తనను, బండిని చేయితో చూపుతూ సైగ చేశాడు.

ఎక్కమన్నట్లు తల ఊపుతూ, కళ్ళను ఓసారి మూసి తెరిచాడు. పగ్గాన్ని లాగి పడుతూ, తన సూట్‌కేసును మొదట బండిలోని ఖాళీ బస్తాలపై పెట్టి బండెక్కాడు.

"ఆ బస్తా మీద కూకోండి"

బస్తా మీద కూర్చున్నాడు. బండి ముందుకు కదిలింది.

"మర్రి గూడెం ఎవరింటికి ?"

" నన్ను టీచర్‌గా ఈ ఊరు వేశారు". టీచర్ అంటే అర్థం అవుతుందో లేదోనని "అదే బడి పంతులు గా" అన్నాడు.

ఐదున్నర అడుగుల ఎత్తు, పాతిక సంవత్సరాల వయస్సు, సింపుల్ వేషధారణ లాల్చీ పైజమా, చురుకైన చూపులు.

బాటంతా ఇసుక చేరి ఉండడం వల్ల బండి చక్రాలు ఇసుకలో వింత శబ్దం చేస్తున్నవి.

చక్రాల కింద రాళ్ళు వచ్చినప్పుడు మాత్రం కర్ మన్న శబ్దానికి వల్లంతా ముల్లెక్కినట్లవుతుంది టీచరుకు.

ఎదురుగా వస్తున్న భర్తీ బండిని చూసి, తన ఎడ్ల పగ్గాలను గుంజి పట్టి, పక్కనుండి పోయే ప్రయత్నం చేస్తున్నప్పుడు ఎదుటి బండిలోని వ్యక్తి -

" ఏం రామన్నా ! ధరలెట్లున్నయ్ ?"

"ఓనాడు మంచిగున్నాయ్ ! ఎన్నడు ఇంతే! అమ్మబోతే అడవి; కొనబోతే కొరివి. నా

వడ్లకైతే చాలా తక్కువ ధర పల్కింది ”

“ఎందుకు.?”

“తాలు ఎక్కువుందని. మరి తాలు నేను కలిపితినా ? తీరా పొట్టకొచ్చి పాలు తాగేటప్పుడు, నాలుగు రోజులు కరెంటు రాదాయె, కర్రలు సరిగ్గా పాలుపోసుకోక పొట్టలవిసి సగానికి సగం తాలాయే. పట్టి, చేసి తీసుకపోయిన ధర పల్కదాయె”

వాళ్ళ సంభాషణ వింటుంటే ఎల్క్ట్రిక్ డిపార్టుమెంటు వారు చేసే సమ్మెలు గుర్తుకొచ్చినవి. వాళ్ళు జీతాల కోసం సమ్మె చేస్తే ఇక్కడ ఈ రైతులకు ఎంత నష్టం జరుగుద్దో అనుకున్నాడు పంతులు.

“బిల్లుకు బిల్లు తప్పదాయె. పంటంతా పాడాయే. ఏం చేస్తాం ? అంతా మనరాత. పొయ్యిర, భర్తీ బండి ఎంత సేపు” అంటూ పగ్గాన్ని కదిలించాడు రామన్న.

భర్తీ బండి పట్టణం వైపు, రామన్న బండి పల్లె వైపు సాగినవి. “ఆరుగాలం రెక్కలిరుసుకొని కష్టం చేసి, కరిసే పాము నెరుగక, కొట్టే దొంగనెరుగక రాత్రింబగళ్ళు కంట్లో ఒత్తులు బెట్టుకొని, పిట్టల నుండి, ఎలకల నుండి, పందికొక్కుల నుండి కాపాడుకొని అమ్మేతందుకు తీస్కపోతే ! ఏం చెప్పను ? ” అంటూ నిమస్తిని జేబులో నుండి ఓ కాగితం తీసి పంతులుకిస్తూ -

“తమరి పేరండి ? ”

“ సత్యం ”

“ఇది సదవండి మీకే తెలుసుద్ది ” అన్నాడు.

అతని ముఖంలోని కాలం గీసిన ముడతల్లో ఎన్నో బాధలు, వేదనలు దాగినట్లు కనిపిస్తున్నాయి.

సత్యం కాగితాన్ని చూస్తున్నాడు. దాని మీద ‘తక్ పట్టి ’ అని ముద్రించి ఉన్నది. ధాన్యం పేరు, ధర, తూకం, మొత్తం రూపాయలు, మార్కెట్ పన్ను, కాటా ఖర్చు, యింకా ఇతరములు పోను నగదు అని రాసి ఉన్నవన్నీ చదివి వినిపించాడు.

“చూసిండ్రుగా, ఎట్ల దోసుకుంటుండ్రో ! ఇవి పొంగ జోకేటోడు, వూకేటోడు, అందరికన్నా ఆ కమీషనోడు ! ఆడు ఎంత ధర రాసిండో సూడు ! ఎవరికందినంత వాళ్ళు దోసుకున్రు. పొలంలో పందికొక్కుల్నుండి కాపాడుకున్నాం గానీ ఈ ఊరపందుల నుండి కాపాడుకోలేక పోతున్నాం ” అంటూ సత్యం చేతిలోని కాగితాన్ని తీసుకొని మళ్ళీ జేబులో పెట్టుకున్నాడు.

రామన్న చూపుల్లో ఏదో కసి, రోషం, సత్యం అతని ప్రతి మాటను పరిశీలనగా వింటున్నాడు. పట్టణాల్లో ప్రజల్ని దోచే తీరు మీద ఆలోచిస్తున్నాడు.

“వడ్లకు ఇంత తక్కువ ధరయితే బియ్యానికి అంత ధరేమిటి ?”

“గదే ఆలోసించాలి. పండిచ్చిన మాకంటే ఆ కమీషనోడే నయం”

బండి చిన్నగా నడుస్తుంటే ఆలోచనల నుండి తేరుకుని క్రిందికి చూశాడు. బండి వాగు దాటుతుంది. వాగునీరి పల్చగా ప్రవహిస్తుంది. చిన్న చిన్న చేప పిల్లలు ఎండకు మెరుస్తూ, తళుక్కున నీటిలో మునిగి తేలుతున్నాయి. అక్కడక్కడ ఇసుక తేలిన చోట కుప్పలు కుప్పలుగా కప్ప పిల్లలు, కాస్త లోతుగా నీరున్న చోట దున్న పోతులు, బర్రెలు పడుకొని మేస్తున్నవి. పసుల కాడి పిల్లలు చేపలు పట్టటం కోసం గిన్నెలతో నీళ్ళను గుప్పుతున్నారు వాగు పక్కనే వున్న గుంటల్లోకి. బండి వాగును దాటి డొంకమ్మటి నడుస్తున్నది.

“నేను గోచి పోసినప్పటి నుండి వ్యవసాయమే చేస్తున్న. ఎంత చేసినా గొర్రె తోక బెత్తెడే”

“భూమెంతుంది ?”

“ఎంతుంటేంది? ఎన్ని పుట్లు పండిస్తేంది. చేసిన అప్పులు సెదలు తిన్నట్లు తింటుంటే”

ఎప్పుడో ఏదో పత్రికలో చదివినట్లు గుర్తుకురాగా -

“ప్రభుత్వమే తక్కువ మిత్తికి అప్పు ఇస్తుంది కదా” కదిలిన సూట్‌కేసును ఖాళీ బస్తాలపై పొందిస్తూ అడిగాడు సత్యం.

“ఇస్తే అయి చేతికొచ్చేవరకు ఎంత తిరగాలె ! ఎంత పైకం కర్సయిద్ది”

“లంచాలా”

“లంచాలే అనుకో, యిగ కర్సులే అనుకో, ఆయన్నీ పోంగా ఎన్ని రోజులు పని జెడాలె ! ఒకసారి అంజుమన్ అప్పుకోసం తిరగంగ, తిరగంగ ఆరేయిలు మంజూరయితే అండ్ల నుండి కరుసులే సానాయే ! మిగిల్నాటితోటి బాయి తోడిస్తే తీర్సెటందుకు ఏడేళ్ళు పట్టె” అంటూ గడగోయ పట్టెకు ఆనుకొని రామన్న వైపు చూస్తున్నాడు. సత్యం.

“ఇంకోసారి భూతనఖ బ్యాంకుకు దరఖాస్తు పెడితే ఆయిలు ఇంజను ఇచ్చిన్రు. అది వున్నన్నాళ్ళు పెద్ద శని ఉండే. మీది పొలం పారపెట్టేది. ఆట్లో అయిదేండ్లు దండుగ ఖర్చులు పెట్టి, పాణం ఏసారి, దాన్ని అడ్డికి పావుసేరు అమ్మేసిన” అన్నప్పుడు రామన్న ముఖంలో ఎంతో విసుగు, విరక్తి కొట్టొచ్చినట్లు కనిపించింది.

“కరెంటు మోటారు ఎందుకు పెట్టలేదు ?”

“గది పెట్టినంకనే కొంచెం అట్ట అట్ట ఉంది. ఎప్పుడూ కరెంటు వస్తే ఏం కాదు కానీ, ఐన మోకాల్నె అది కూడా రాదు. దాని కోసం ఎంత తిరగాలె ఎంత కరుసు, చ్చొ చ్చొ ....చ్చొ .... వాళ్ళయితే యిగ జలగలే అనుకో”

సత్యం కుడి చేతిని పిడికిలిగ మూసి నోరు దగ్గర పెట్టుకొని వూదుతూ రామన్నను పరిశీలనగా చూస్తున్నాడు. తనకు ఇంత వరకు తెలియని పాఠం చెబుతున్న లెక్చరర్‌లా

కనిపించాడు రామన్న.

"అయ్యయ్యో ! మాకున్న బాధలు ఇంకెవరికుంటాయి ? పండిస్తూ పస్తుండటం, కష్టపడుతూనే కరువెళ్లదీస్తాం. మా బతుకులు ఆ ఆన దేవుని మీద ఆధారమయా. ఆన కురిస్తే గానీ మాకింత గంజి, గొడ్లకింత గడ్డీ "

వ్యవసాయ దేశం - అన్నపూర్ణ, పాడి పంటలకు పుట్టినిల్లులాంటి మాటల్ని పుస్తకాల్లో చదివిన సత్యం, ఈ వింటున్నదేమిటి ? అనుకుంటూ ఆకాశంలోకి చూశాడు. కదులుతున్న మేఘాల్లో ఇండియా మ్యాప్ కనిపించింది. దాన్నిండా రామన్నలే కనిపించారు.

బండి ఆపి, పక్క చేలో మంచె మీదున్న మనిషిని చేయి సైగ చేసి పిలిచాడు రామన్న. మంచె మీది మనిషి దిగి వస్తూ -

"బాగున్నవ రామన్నా ! "అన్నాడు ఎనుగవతలి నుండి.

"ఆ పాయినోళ్ళంతా పోంగ వున్నోళ్ళం ఇట్లున్నం "

"బండాపి రారాదు ! యింత కల్లు తాగి పోదువు ! మొగమంతా గుంజకపోయింది"

"ఇగ యాడుంటా, ఎడ్లు నిలబడేటట్లు లేవు గానీ, రెండు దోసకాయలు, రెండు పచ్చి మిరప కాయలు తెంపుక రా, పొద్దున్న హోటల్ల పెట్టిన గింత ముద్ద ఏ మూలకు పోయిందో "

"అయితే వుండు తెస్తా " అంటూ చేలోకి పోయి, నాలుగైదు దోసకాయలు, కొన్ని పచ్చి మిరప కాయలు, దోతి కొంగులో తెచ్చి రామన్నకు అందించాడు. కొమ్మలను యిరుచుకొని తెచ్చిన కంది మండలను పంతులుకు యిస్తు -

"యివి తినండి సార్ బాగుంటయ్ "అన్నాడు.

"థాంక్స్ అని మళ్ళీ తెలుగులో అలాగా " అంటూ నవ్వుతూ అందుకున్నాడు.

"మరి పొయ్యొస్త ఇంటి కాడ పిల్లల్ని అడిగిన్నని చెప్పు " అంటూ ఎడ్లని అదిలించాడు రామన్న. అప్పటి వరకు కళ్ళు మూసుకొని నెమరేస్తున్న ఎడ్లు కదిలినవి. బండి ముందుకు కదిలింది.

సత్యం కంది కాయల్ని వొలుచుకొని తింటున్నాడు. రామన్న మొలతాడుకున్న కీలీ కత్తితో దోసకాయను చెక్కు తీస్తున్నాడు. చెక్కు తీసినప్పుడు లోపల తెల్లని భాగమంతా రామన్న చేతులకున్న మట్టి అంటి రంగు మారుతున్నది. చెక్కు తీసిన కాయను నాలుగు భాగాలుగా కోసి రెండు భాగాలను సత్యానికివ్వబోయాడు రామన్న.

"నాకు కందికాయలు చాలు రామన్నా ! నీవు తినేసేయ్ "

"నీ ఇష్టం " అంటూ దోస ముక్కల్ని నములుతూ మధ్య మధ్య పచ్చి మిరపకాయల్ని కొరుక్కుని తింటున్నాడు. రామన్న కళ్ళలో అదో మాదిరి తృప్తి కదులుతుంది.

"ఉప్పుంటే బాగుండు " అన్నాడు రామన్న మొత్తం కాయల్ని తిని చేతుల్ని బండిలో వున్న ఖాళీ బస్తాలకు తుడుస్తూ.

"పొద్దున రెండున్నర తీసుకొని గింత అన్నం ఇచ్చి, మూడు నాలుగు కూరలు, మల్ల ఇంత చారు ! ఏం చేసికోను ? "

"ఒక కూర కాకున్నా మరో కూరతో తింటారని "అన్నాడు సత్యం నవ్వుతూ.

"గవన్నీ మాకెందుకు ? కడుపు నిండేదొక్కటే లెక్క "

కూర ఒక్కటైనా కాస్తంత రైస్ అదే అన్నం ఓ ముద్దెక్కువ వుండాలంటవ్.

"గంతే గద మరి ! ఆకలి రుచి ఎరుగుద్దా ? " అంటూ తలపాగ కొంగును నోట్లో పెట్టి ఊది వెంటనే దాన్ని కన్నుకు అద్దుకున్నాడు.

" ఏమైంది ? కళ్ళెర్రగైనయి " రామన్న కళ్ళవైపు చూస్తూ అడిగాడు.

"మిడత తగిలింది. యిట్ల ఆయి పెడితే పోద్ది "

కొంత సేపు మౌనంగా గడిచింది.

" పంతులూ ! సర్కార్ అప్పులిచ్చి మిత్తితో సహా వసూలు చేస్తుండ్రి. లేకుంటే గొర్రెల్ని, నగల్ని, గిన్నెల్ని గుంజుకుపోతుండ్రి. కరెంటోడు కరెంటిచ్చి బిల్లు తీసుకుంటూనే ఆలిసం అయితే ఫీజు పీకుపోతుండే. మరి మేం కట్టే పన్నులు ఏం చేస్తున్నట్టు ? నాకెరుకలేక అడుగుతా " అంటూ సత్యం వైపు చూశాడు రామన్న.

కంది కాయలను తినడం ఆపి " ప్రజలిచ్చే పన్నుల్ని తిరిగి ప్రజలకే ఖర్చు పెడతారు. న్యాయ స్థానాలు, పోలీసులను పెట్టి దవాఖానాలు పెట్టి అందరికీ ఉచితంగా మందులిస్తారు. పాఠశాలలను కట్టించి మీ పిల్లలకు చదువు చెప్పిస్తారు. ఇలానే ఇంకా ఎన్నో .. "అంటూ కంది కాయల్లో నిండు కాయల్ని వెదుకుతున్నాడు.

"మా ఊరు పంతులు చదువు చెప్పడు ! పంచాదులు చెపుతడు "

" సత్యానికి నవ్వొచ్చింది "

"ఈనాటి పంతుళ్ళు తమ స్థానం కోల్పోయి పైరవీకార్లుగా మారుతున్నందుకు నాకు బాధగానే వుంది " అన్నాడు సత్యం.

"యిగ దవాఖానల సంగతంటరా " అంటూ ఒక్కసారె మౌనం వహించాడు రామన్న. బండి రాళ్ళ బాటన నడుస్తుండటం వల్ల కదిలి ఊపేస్తుంది.

"చెప్పు రామన్నా ! చెప్పు. నీవు చెప్పేదంతా నిజమే ".

" ఏం నిజమో - ఏం లోకమో "

"దినదినానికి మనిషి రాచ్చసైపోతుంటే ... బతుకుల్లో సుఖం యాడుంటది పంతులు"

రామన్న వేదాంతిలా చెపుతుంటే సత్యం వింటూ జీవితంలోని చేదు నిజాల గూర్చి ఆలోచిస్తున్నాడు.

" ఏం చదువుకోకున్నా ఇంత జ్ఞానాన్ని ఎలా నేర్చుకున్నావు రామన్నా ? "

"సాపకు నీళ్ళు ఈత నేర్పినట్టే, నాకు ఈ బతుకే నేర్పింది పంతులు "

" ఏదో ఎడ్డి సన్నాసులం. అందుకే మాకిన్ని కష్టాలు " కొన్ని నిముషముల తర్వాత -

"తమరేదో దవాఖానలు అన్నరు కదూ ! ఆటి సంగతి. .. "

"చెప్పు " అన్నాడు సత్యం కాస్త కదిలి కూర్చుంటూ.

"మొదటి కానుపు మాఇంటి కాడనే చెయ్యాలని, నా బిడ్డను అత్తగారింటి నుండి తీసికొచ్చిన. దినమంతా ఆపతి పడ్డా నీల్లాడలేదు. ఈడ ఈలుగాదని, దవాఖానాకు తీసుకుపో అని మంత్రసాని సెపితే బండి కట్టుకొని దవాఖానాకు పోయేసరికి గోరుకొల్లు పొడిసి బారెడెక్కినయి. అందరూ నిద్ర పోతుండ్రు. కాళ్లేల్లు మొక్కంగా లేసిండ్రు. డ్యాక్టర్ సూసి ముక్కిరిసి ఆప్రేషన్ చేయాలనే. ఆయన కిందాయన పక్కకు పిలిచి మరి డబ్బుతెస్తివా అని అడిగె. లేదు, బాట కరుసుకు ఐదో పదో తెచ్చుకున్న అంటే పెద్దాపరేషన్ శానా కావాలానె. తెల్లారినంక ఊరికి పోయి తెచ్చిస్తనంటే మంచం ఖాళీ లేదనే డ్యాక్టర్. మంచం లేకుంటే మానె, మందన్నా ఇయ్యండ్రి కింద పడుకుంటం అని తల్లెంతో బతిలాడే ! ఎవరు యినరైరి. మమ్ములను బయటకి నూకేసి పాటకి మూసుకుండ్రి " అంటూ ఆగాడు రామన్న.

"చ్చొ ...చ్చొ.. " అన్నాడు సత్యం తనకు తెలియకుండానే.

"బండిని ఎదురుగా ఉన్న ఏపచెట్టు క్రింద యిడిసి, ఇంత గడ్డిని బండి కిందేసి దాంట్లో నా బిడ్డను పడుకోబెట్టి, తల్లినీ, మంత్రసానిని ఉంచి, వుర్కుంటపోయి డబ్బు తీసుకొని వస్తలకు... ! "

"ప్రసవించిందా ? " అడిగాడు సత్యం ఆతురతగా.

రామన్న ఒక్కసారి పిచ్చివానిలా నవ్వాడు.

"భూమ్మీదికి రావాల్సిన పసిగుడ్డు రాలేక కడుపులోనే సచ్చింది. బిడ్డను కనుకోవాలని తల్లి తన్నుకొని, తన్నుకొని సచ్చింది. పిచ్చిదానిలా ఏడుస్తూ నెత్తి నోరూ కొట్టుకుంటూ దవాఖానా మీద మన్ను పోస్తుంది నా భార్య "అన్నప్పుడు రామన్న గొంతు జీరపోయింది.

గుండెలోనే బాధను దిగమింగుతూ "ఇప్పుడు సెప్పు పంతులు ! నేను ఏటేటా పన్నులు కడతనే ఉన్నా గదా మరి నా బిడ్డకు ఎందుకు మంచం లేదాయే ? ఎందుకు మందు దొరకదాయే ? "అంటూ సత్యం వైపు చూశాడు.

అన్యాయం.... అన్యాయం.....

రామన్న కళ్ళలో నీళ్ళు తిరిగినయి ! ముక్కు తడైంది. గొంతు ఆవిరిలాంటి వేడిని వదిలింది.

"బిడ్డ అట్ల చచ్చే...కొడుకేమో.. "

"కొడుకూ "అంటూ రామన్న వైపు వంగి ముఖంలోకి చూశాడు.

"సావలే ! సంపిండ్రు "

" ఎవరు ? "

"తెలవదు ! "రామన్న గొంతులో మార్పొచ్చింది.

" పన్నెండోది పాసయినంక పట్నం చదువుకని పోయిండు . రెండేండ్లు బానే సదివిండు. ఓనాడు ఆయనతోటి చదువుకునే సోపతిగాళ్ళు రక్తం ముద్దయిన పీసుగను మా ఊర్కి తీసికొచ్చిండ్రు. అది సూసి తల్లి నోటి మాట పడిపాయె, ఎవరు సంపిండ్రంటే పోలీసోళ్ళని సోపతిగాళ్ళనిరి. పోలీసోళ్ళనడిగితే, మేం గాదు నీవు ఓటేసి గెలిపించిన నాయకులనిరి. ఈయ్యాల్టి వరకు ఎవరు సంపింది తెలవక పాయె. ఏడ్చేడ్చి నాకన్నీరింకిపాయె " అని ఆగాడు రామన్న.

ఇద్దరి మధ్య నిశ్శబ్దం.

బండి నడుస్తూనే వుంది. బాటకు రెండు వైపులా బాగా పెరిగిన సర్కార్ కంప చెట్లు, బాటకు అవరోధంగా వంగి వున్నాయి. బండి ఇరుసులో నూనె ఎండిపోయిందేమో అది కిర్ర్ కిర్ర్ మంటుంది.

సత్యం కళ్ళముందు విద్యార్థుల మూమెంట్స్, వాటిని వాడుకొనే అవకాశవాదులైన రాజకీయ నాయకులు కదిలారు.

" చెప్పు, ఇక చెప్పు పంతులు, నేను ఓటేస్తునే వుంటి నా కొడుకునెందుకు సంపిండ్రు, మరి మాకు రచ్చనేది ? " అంటూ సత్యం వైపు చూశాడు.

సత్యం మౌనంగా చూస్తూ వున్నాడు. ఎవరు కారకులు వీటికి. ఎన్నడు అంతం వీటికి ? ఇలాంటి ఆలోచనలతో తల బరువెక్కింది.

బండి చెరువ కట్ట ఎక్కింది. చెరువు నిండా నీరుంది. పడమరకు వంగిన సూర్యున్ని చెరువు మింగుతున్నట్లుంది. చెరువులో నీరంతా ఎరుపు, పసుపు కలిపిన బంగారు రంగును పులుముకుంది.

ఉన్నట్లుండి బండి ఆగింది. ఎడ్లు బుస కొడుతూ కదలక నిలుచున్నాయి. ముందుకు చూచిన సత్యం పాము ! పాము ! అని అరిచాడు. పామును చూసిన రామన్న అలాగే లేచి నిలుచొని, చేతిలోని కర్రను తొట్లోనే వేసి -

" పో, నీ తోవన నీవు పో తల్లీ, బాటలెందుకున్నవ్ ? "అన్నాడు రామన్న చేతులు

జోడించి,

వెంటనే పాము పడగ దించుకొని పక్క పొదల్లోకి వెళ్ళిపోయింది.

రామన్న తొట్లోని కమిష కర్రను చేతిలోనికి తీసికొని, ఎడ్లని అదిలించాడు.

బండి కదిలింది.

సత్యం ఆశ్చర్యచకితుడై -

"కట్టె కింద పడేస్తే పాము పైకొస్తుందనుకున్న"

సత్యం మాటలకు రామన్న ముఖం నిండా నవ్వును నింపుకొని -

"కట్టె కింద పడేస్తే మీది కొచ్చేది ఒక్క మనిషే" అని అన్నాడు.

సత్యం వళ్ళు జల్లుమంది.

శిలువ మీదున్న క్రీస్తులా కనిపిస్తున్నాడు రామన్న సత్యానికి. సత్యం చూపులు రామన్న మీద, ఆలోచనలు రామయ్య సమస్యల మీద. కట్ట దిగుతుంటే పగ్గాలు లాగి బండినాపి, ఊరొచ్చింది దిగుతరా పంతులు.

"నీవు రావా అనబోయి మీరూ ఊళ్ళోకి రారా" అన్నాడు బండి దిగుతూ

"రాను, ఊళ్లో ఏముంది నాకు ? అక్కడే బాయి దగ్గరే వుంటున్న"

"మీకు తీరికున్నప్పుడు ఓసారి కలవండి, లేదా నేనైనా మీ బావి దగ్గరకు వస్తా" అంటూ సత్యం బండి దిగి సూట్‌కేసును దించుకోగానే బండి బావివైపు పరుగుతీసింది.

ఊరివైపు నడుస్తున్న సత్యం తలనిండా ప్రశ్నలే !

'కరెంటు బిల్లు కడుతున్నా చేన్లు ఎండిపోతునే వున్నయి. పన్నులు కడుతున్నా దవాఖానాలో నా బిడ్డకు మంచం ఎందుకు దొరకలే. ఓటేస్తునే ఉన్నా నా కొడుకు రక్షణ ఎందుకు లేదాయే ? కర్ర కిందేస్తే పైకొచ్చేది ఒక్క మనిషే ! ఇంతవరకు చదివిన పాఠాల్లో వీటికి జవాబు ఎక్కడా లేదు' అనుకుంటూ ఊళ్ళోకి ప్రవేశించాడు.

అప్పుడే ఊరు చేరుతున్న పశువుల డెక్కలు లేపిన దుమ్ము సత్యాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది.

ఊళ్ళోని వేప చెట్ల మీద, చింత చెట్ల మీద కొంగలు విపరీతమైన శబ్దం చేస్తున్నవి.

ఇండ్లలో మిణుకు మిణుకుమంటున్న దీపాలను చూస్తూ నడుస్తున్న సత్యం కళ్ళు వెదుకుతున్నాయి బడికోసం.

•